
ప్రజాశక్తి

శుక్రవారం 26 జులై 2024 | 5 | విజయనగరం



ప్రభుత్వ వైద్య కళాశాలలో 26 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, బోధన ఆసుపత్రి పరిధిలో 26 జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం http://vizianagaram.ap.gov.in, http://vizianagaram.nic.in తదితర వెబ్‌సైట్‌లను సందర్శించి తెలుసు కోవాలని కోరారు.

బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



విజయనగరంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు



శృంగవరపుకోటలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు, ప్రజలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసనగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సిపిఎం ఆధ్వర్యాన గురువారం నిరసన తెలిపారు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారన్నారు. విభజన చట్టంలోని అంశాలను నెరవేరుస్తామని.చెప్పడం తప్ప ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. పోలవరానికి నిధులు లేవు, ఉత్తరాంధ్ర సుజలస్రవంతికి నిధులు కేటాయింపు లేదు,రైల్వే జోన్ ప్రస్తావన లేదు, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ కి నిధులు కేటాయింపు లేదు, అమరావతి నిర్మాణానికి ప్రకటించిన 15వేల కోట్లు ప్రపంచ బ్యాంక్ అప్పుకింద చెప్పడం దుర్మార్గమని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపు లు చేయకుండా కేటాయిస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మరోసారి బిజెపి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వ విధానాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తగిన నిధులు కేటాయింపులు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, పి.రమణమ్మ, బి.రమణ, యుఎస్ రవికుమార్, సిహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ఆధ్వర్యంలో గురువారం టీచర్ కాలనీ వద్ద రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మణికుమార్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు వి.శేషగిరిరావు, భూషణం, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో కొత్తవలసలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేపట్టారు. కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నినాదాలు చేశారు.

రామభద్రపురం : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం మండల నాయకులు బలగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుర్గారావు, చినరాజు, నాగరాజు, వెంకటప్పలు, పెదరాజు, సోములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద సిపిఎం జిల్లా నాయకులు కె.సురేష్ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, సిహెచ్ ముత్యాలు, టి.చిన్న, ఎస్.బుజ్జి, రాము, టి.సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు

మహాత్మా.. కేంద్రానికి మంచిబుద్ధి ప్రసాదించు

గజపతినగరం : ప్రజలు, రైతులు, కార్మికుల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేసేలా కేంద్రానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ గజపతినగరం పంచాయతీ కార్యాలయం వద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యాన వినతి అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి నిధులు కేటాయించలేదన్నారు. కార్పొరేట్లకు లాభాలు తెచ్చిపెట్టే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని, రాష్ట్రానికి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికులకు, యువతకు ఉపాధిని లేకుండా చేశారని మండిపడ్డారు. మద్దతుధర చట్టం, కార్మికుల కనీస వేతనాల చట్టం అమలు వైపు దృష్టి పెట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల వైపు ఆలోచించేలా బుద్ధి మార్చాలని గాంధీని కోరామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాకోటి రాములు, నాగేశ్వరరావు, కోటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి, కొత్తవలసలో రాస్తారోకోలు చేస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

ఫేక్ కాల్స్‌పట్ల అప్రమత్తం

ఎస్‌పి వకుల్ జిందాల్



ప్రజాశక్తి-విజయనగరంకోట

ఫెడెక్స్, బ్లూడాట్ కొరియర్స్ పేర్లతో వచ్చే కాల్స్, లింక్స్, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ తరహా కాల్స్, లింక్స్, వీడియోకాల్స్‌తో సైబరు మోసగాళ్ళు ప్రజలకు ఉచ్చు వేస్తూ, వారి నుండి డబ్బులు కొల్లగొడుతున్నారన్నారు. ఇటీవల సైబరు మోసగాళ్ళు మొబైల్స్‌కు ఫోను చేసి తాము ఫెడెక్స్ లేదా బ్లూడాట్ కొరియర్స్ నుండి మాట్లాడుతున్నామని, మన చిరునామా, ఆధార్ నంబరు, ఫోను నంబరు వంటి కొంత సమాచారాన్ని ముందుగా మనకు తెలిపి, మనం బుక్ చేసిన కొరియర్ పార్సిల్లో నిషేదిత మాదక ద్రవ్యాలు, ఫేక్ పాస్పోర్టు, బంగారం బిస్కెట్లు ఉన్నాయని, మనీ ల్యాండరింగుకు పాల్పడుతున్నట్లుగా గుర్తించినట్లు, విచారణ నిమిత్తం తాము సూచించిన సూదుర ప్రాంతానికి దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందన్న సమాచారం అందిస్తారని వివరించారు. తాము రాలేని పరిస్థితుల్లో ఉన్నామని చెబితే, ఆన్లైనులో కూడా దర్యాప్తుకు హాజరుకావచ్చునని, తమకు ఒక లింకు పంపుతున్నామని, వాటిపై క్లిక్ చేసి, సెట్లో దర్యాప్తుకు హాజరుకావాలని సూచిస్తారన్నారు. ఈ లింకును క్లిక్ చేస్తే, తమ బ్యాంకు సేవింగు ఖాతాల్లోని నగదు చోరీకి గురవుతుందన్నారు. తమ బ్యాంకు ఖాతాను రిజర్వు బ్యాంకు సహకారంతో పరిశీలించాల్సి ఉందని, వివరాలు సేకరించి, ఖాతాలో డబ్బును కాజేస్తారన్నారు. బిట్ కాయిన్ లేదా క్రిప్టో కరెన్సీ పేరుతో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించి, పెట్టుబడి పెట్టిన నగదుకు అధికంగా పెరిగినట్లుగా చూపుతారన్నారు. ప్రజలందరూ ఇటువంటి సైబరు మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ బ్యాంకు ఖాతా, పాస్పోర్టు, ఆధార్ కార్డు, మొబైల్స్ కు వచ్చే ఒ.టి.పి.లను ఎవ్వరికీ చెప్పవద్దన్నారు. ఈ తరహా నేరాల్లో ఎవరైనా నగదును పోగొట్టు కొన్నట్లయితే 1930 కు లేదా నేషనల్ సైబర్ క్రైం పోర్టల్లో https://cybercrime.gov.in కు రిపోర్టు చేయాలని ప్రజలకు సూచించారు.

తైక్వాండో క్రీడాకారులకు శిక్షణ

విజయనగరం టౌన్ : ఈనెల 25 నుంచి 31వరకు నిర్వహించనున్న 7వ జాతీయ స్థాయి తైక్వాండో కేడిట్ పోటీలకు అర్హులైన రాష్ట్రస్థాయి విజేతలకు స్థానిక విజయనగరం డియస్ఎ రాజీవ్ స్టేడియంలో కోచింగ్ క్యాంప్ గురువారం ప్రారంభమైంది. ఈ శిక్షణను డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 25మంది క్రీడాకారులు వివిధ జిల్లాల నుండి పాల్గొన్నారు. డివి చారి ఆధ్వర్యంలో కోచ్‌లు టి.రాము, (అనంతపూర్) ఎ. అఖిల్ (ప్రకాశం) యన్.రవి, వినీష్, (విజయనగరం) శిక్షణ ఇస్తున్నారు. తైక్వాండో రాష్ట్ర అధ్యక్షులు హర్షవర్ధన్ ప్రసాద్ , జాయింట్ సెక్రటరీ డివిచారి (ప్రసాద్) పాల్గొన్నారు.

గ్రామ సందర్శనతో సమస్యలకు పరిష్కారం

- ముద్దూరులో పాల్గొన్న కలెక్టర్
- సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ఆదేశాలు
- పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ఆరా
- ఆగస్టు 10లోగా వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని పూర్తిచేయాలని ఆదేశం



ముద్దూరు గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రతి గురువారం నిర్వహిస్తున్న గ్రామ సందర్శనలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం బొండపల్లి మండలం ముద్దూరులో పర్యటించారు. గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా కలెక్టర్ పర్యటనతో గ్రామస్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం లభించింది. గ్రామంలోని రెల్లిపేటలో తమకు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా కావడం లేదని ఆ ప్రాంత మహిళలు కలెక్టర్ కు విన్నవించడంతో ఆ సమస్యపై కలెక్టర్ గ్రామీణ నీటిసరపరా అధికారులతో ఆరా తీశారు. గ్రామంలోని కొందరు తాగునీటి పైప్‌లైన్లకు మోటార్లు బిగించి నీటిని అక్రమంగా మళ్లిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై వెంటనే చర్య తీసుకొని అక్రమంగా మోటార్లతో నీటిని తోడేస్తున్నవారిపై కేసులు నమోదు చేయడంతోపాటు శుక్రవారం సాయంత్రంలోగా రెల్లిపేట ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసి తనకు రిపోర్టు చేయాలని గ్రామీణ నీటిసరఫరా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రైవేటు భవనంలో కొనసాగుతుండటంపై ప్రశ్నించారు. వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని మంజూరు చేశారని, నిర్మాణం అసంపూర్తిగా వున్నట్టు వైద్యాధికారి వివరించారు. దీనిపై కలెక్టర్ పంచాయతీరాజ్ జెఇ కృష్ణమూర్తిని ప్రశ్నించారు. వచ్చే ఆగష్టు 10వ తేదీలోగా భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అప్పగించాలని, లేదంటే సస్పెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఆరోగ్యకేంద్రం పనితీరుపై కలెక్టర్ తనిఖీ చేశారు. ఒపి తనిఖీలు, వయోవృద్ధులకు, బిపి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, మందుల లభ్యత తదితర అంశాలపై తెలుసుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకొనే ప్రయత్నం చేశారు. యూనిఫాంలు ఇవ్వలేదని ఉపాధ్యాయులు తెలుపగా ఎందుకు ఇవ్వలేదని కలెక్టర్ ప్రశ్నించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా వుంచడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. గ్రామంలో 390 కుటుంబాలు వుండగా ఇందులో కేవలం 11 మంది పిల్లలు మాత్రమే అంగన్‌వాడీలో వుండటంపై ఇంటింటికీ వెళ్లి గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లలపై సర్వే చేయాలని ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఒక మొక్కను కలెక్టర్ నాటారు.

గ్రామంలోని యువతతో కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడారు. ప్రతి యువతీ యువకునికి జీవితంలో ఒక లక్ష్యం వుండాలని చెప్పారు. గ్రామంలో ఇంటర్ ఆపై విద్యార్హతలు కలిగి ఖాళీగా వుంటున్న యువత ఎంతమంది వున్నారనే అంశంపై ఇంటింటి సర్వే చేసి నివేదించాలని ఎంపిడిఒ, నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్‌కు ఒక వ్యక్తి తన ఇంటికి సంబంధించిన ఇంటిపన్ను చెల్లిస్తే నిరాకరిస్తున్నట్టు ఫిర్యాదు చేయగా పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచిస్తూ ఆ సమస్య పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఉపాధిహామీ పనులపై గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదులు చేయగా దీనిపై విచారణ చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిస్తులపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, భూగర్భ జలశాఖ డి.డి. దుర్గాప్రసాద్, ఎంపిడిఒ, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, గ్రామంలోని పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



214 రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు నిల్

- ప్రతిపాదనలు పంపకపోయినా ప్రశ్నించని అధికారులు
- పరిమితికి మించి ప్రైవేటుకు కేటాయింపులు
- అవస్థలు పడుతున్న రైతులు

అసలే చిన్న సన్నకారు రైతులు.. చినుకుపడితే పంటల సాగుకు అదును. ఒక్కనాడు అదును ఏడాది బతుకు అని కూడా రైతులు వాడే సామెత. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు అదునుకు ఎరువులు అందించాల్సిన అధికార యంత్రాంగం 214 రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచలేదు. మరోవైపు ప్రైవేటు డీలర్లకు మాత్రం పరిమితికి మించి ఎరువులు కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో, సమయానికి స్థానికంగా ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదును తీరకపోవడంతోపాటు ఆర్థిక భారం మోయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని జిల్లా వ్యాప్తంగా 2,99,455 ఎకరాలు సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 2,84,807 ఎకరాల్లో వివిధ పంటలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 22,2500 ఎకరాలకు సరిపడా నారు పోత పూర్తయ్యింది. సుమారు వరకు 10వేల ఎకరాల్లో యద, డ్రమ్ సీడర్ వంటి యాజమాన్య పద్ధతుల్లో నాట్లు పడినట్టు అధికారులు చెబుతున్నారు. నీటి వసతి ఉన్నచోట గత కొద్దిరోజులుగా ఉబాలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో యూరియా, డిఎపి కోసం ఎదురు చూస్తున్నారు. మొక్కజొన్న 8,410 ఎకరాల్లోనూ, పత్తి 1447 ఎకరాల్లోనూ, చెరకు 2,800 ఎకరాల్లోనూ సాగయ్యింది. ఈ మూడు పంటలు ఆకులు తొడిగి, ఎదిగే దశలో ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎరువులు ఎంతో అవసరం. కానీ, చాలా చోట్ల ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారుల ఉదాసీనత, పాలకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్నిపంటలకూ కలిపి 51,476 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమౌతాయి. జూన్ నెలాఖరు నాటికి 15,829 మెట్రిక్ టన్నులు అవసరమౌతుందని అధికారులు అంచనా. లక్ష్యానికి మించి అంటే దాదాపు 17,795 మెట్రిక్ టన్నులు వరకు పంపిణీ జరిగినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ రైతులు ఎరువుల కొరత ఎదుర్కొటుండడం గమనార్హం. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాకు కేటాయించిన ఎరువుల్లో 50శాతం ప్రైవేటు డీలర్లకు, 30శాతం రైతు సేవా కేంద్రాలకు, 20శాతం మార్క్ఫెడ్‌కు కేటాయించి, తద్వారా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాల్సివుంది. అందుకు విరుద్ధంగా కేటాయింపులు జరిగినట్టుగా తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు డీలర్లు 14,854 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించగా, మరో 14, 573 మెట్రిక్ టన్నుల మేర నిల్వలు ఉన్నాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2,940 మెట్రిక్ టన్నులు మాత్రమే విక్రయించారు. నిల్వ కూడా కేవలం 6250 మాత్రమే ఉంది. ప్రవేటు డీలర్ల వద్ద గత ఏడాది కన్నా 4,170 టన్నులు ఎక్కువగా నిల్వ ఉన్నప్పటికీ, రైతు సేవాకేంద్రాల్లో 11,234 టన్నులు తక్కువగా ఉండడం గమనార్హం. మార్క్ఫెడ్‌లో కూడా గత ఏడాది ఇదే సమయానికి 1096 మెట్రిక్ టన్నుల నిల్వ ఉండగా, ప్రస్తుతం 900 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నాయి. దీన్నిబట్టి ప్రైవేటు డీలర్లపై ప్రేమ చూపించినట్టుగా అర్థమౌతోంది.

జిల్లా వ్యాప్తంగా 510 రైతు సేవా కేంద్రాలు ఉండగా, ఇప్పటి వరకు అధికారులు కేవలం 296 కేంద్రాల్లో మాత్రమే ఎరువులు అందుబాటులో ఉంచారు. మిగిలిన 214 కేంద్రాల నుంచి ఎరువుల కోసం ప్రతిపాదనలు కూడా పంపలేదు. అయినప్పటికీ, సంబంధిత మండల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కనీసం వివరణ కూడా కోరకపోవడం గమనార్హం. ఆయా కేంద్రాల పరిధిలోని వందలాది గ్రామాల్లో ఎరువులు అందుబాటులో లేవు. దీంతో, రైతులు పట్టణ ప్రాంతాల్లోగల ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేసుకుంటున్నారు. వాటిని కూడా అదునుకు తెచ్చుకోలేక, అధిక ధరలు చెల్లించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చి, వ్యవసాయ పనులు ఊపందుకున్నప్పటికీ ఇప్పటి వరకు పాలకులుగానీ, ఉన్నతాధికారులుగా అప్రమత్తం కాలేదు. సమస్య జఠిలంగా మారతున్నప్పటికీ కనీసం పాలకులు క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుసుకోకపోవడం, సమీక్షలు జరపకపోవడం నిర్లక్ష్యానికి నిలువుటద్దం.

సమీక్షిస్తాం : కలెక్టర్ అంబేద్కర్



కొన్ని రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేనట్టు నా దృష్టికి వచ్చింది. ఒకటి రెండు రోజుల్లో సమీక్షించి, యుద్ధ ప్రాతిపదికన పంపిణీ చేపడతాం. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధిక ధరలు వసూలు చేస్తే ఫిర్యాదులు చేయవచ్చు. వారిపై చర్యలు తీసుకుంటాం.

వికలాంగులకు సేవ చేయడం అదృష్టం

విశాఖ సిపి శంఖబ్రత బాగ్చి



కృత్రిమ అవయవాల పంపిణీలో పాల్గొన్న విశాఖ సిపి శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి-కొత్తవలస

వికలాంగులకు సేవ చేయడం ఎంతో అదృష్టమని విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గురువారం మంగళపాలెం వద్దనున్న గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు, పోలియో కాలిపర్స్, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడమే నిజమైన భక్తి అంటూ స్వామి వివేకానంద చెప్పిన సూక్తిని ప్రస్తావించారు. వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్న ట్రస్ట్ చైర్మన్ ధన్యులని కొనియాడారు. ముందుగా ట్రస్ట్ ప్రాంగణంలోని అవయవ తయారీ కేంద్రం, గురుదేవ్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా 100 మంది అంధులకు పింఛన్లు, వృద్ధులకు రేషన్ అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనితీరుపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యరక్షణ కూడా ఎంతో ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. ప్రతి గురువారం డివిజన్ పర్యటనలో భాగంగా గురువారం రెండో డివిజన్ ప్రాంతంలో పర్యటించారు. పూల్ బాగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నిరుపయోగంగా పడి ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రధానంగా భవన నిర్మాణాలను చేపడుతున్న వ్యర్థాలను ఖాళీ స్థలాలలో పడవేయటం వల్ల మురికినీరు ఎక్కువగా చేరుతున్నట్లు గమనించా మన్నారు. కార్పొరేటర్ బండారు ఆనందబాబు, ఎసి తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీ రావు పాల్గొన్నారు.

షాపుల వేలం వాయిదా

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ అధీనంలో ఉన్న ఖాళీ దుకాణాలకు నిర్వహించిన బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న 22 దుకాణాలకు, పాత కొత్త ఐడియస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. పాటదారులు నిబంధనలను అనుసరించి వేలంపాట ప్రక్రియలో పాల్గొనందున వాయిదా పడింది. శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పలరాజు, చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్రమాజీమంత్రి అశోక్‌గజపతిరాజు గురువారం సచివాలయంలో సిఎం చంద్రబాబును కలిసి పలు సమస్యలపై చర్చించారు. అనంతరం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును తన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వీరితోపాటు విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు తదితరులు ఉన్నారు.

పనిచేయని ఇవిఎంల తరలింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోడౌన్‌లో ఉన్న పని చేయని, అదనంగా ఉన్న, ఎన్నికలలో డెమోకు వినియోగించిన డమ్మీ ఇవిఎంలను బెంగుళూరులో నున్న బెల్ కంపెనీకు గురువారం రెండు వాహనాలలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో తరలించారు. ఎన్నికలలో వినియోగించని (డిఫెక్ట్) ఇవిఎంలలో బియులు 174, సియులు 930, వివిపాట్‌లు 224 యూనిట్లను బెల్‌కు పంపించారు. వీటిని కలెక్టర్, పోలీస్, పొలిటికల్ ప్రతినిధుల ఆధ్వర్యంలో వాహనాల్లోనికి ఎక్కించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వాహనానికి ఇద్దరేసి పోలీస్ ఎస్కార్ట్‌తో పాటు రెవెన్యూ ఉద్యోగిని ఇంచార్జ్‌గా పెట్టి వాహనాలను తరలించాల న్నారు. ఇవిఎంలను ఎక్కించినపుడు, దించినపుడు వీడియోగ్రఫీ చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దార్ డి.ధర్మ రాజు, ఇవిఎంల ఇంచార్జ్ ఉమాశంకర్, నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కర రావు అన్నారు. గురువారం ఆయన కొండవెలగాడ పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నూతన పిహెచ్‌సి భవనం సందర్శించి భవన నిర్మాణం పనులను పరిశీలించారు. నూతన భవనంలో వైద్య సేవలు అదించాలని, ప్రసవాలు ఇక్కడే నిర్వహించాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పిహెచ్‌సిలో వివిధ రిజిస్టర్స్‌ను తనిఖీ చేశారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌పై పూర్తి అవగాహన కల్పించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్

గతంలో దరఖాస్తు చేసిన వారూ మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో పోస్టుల భర్తీ కోసం గతంలో జారీ చేసిన 1/23 నోటిఫికేషన్ ను రద్దు చేసి దాని స్థానంలో అదనపు పోస్టులు జోడించి మళ్లీ నోటిఫికేషన్ ఇస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. గతంలో దరఖాస్తు చేసిన వారూ మళ్లీ ఈ నోటిఫికేషన్ కింద మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 13, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 69 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తామని తెలిపారు. వివరాలకు www. vizianagaram.nic.in వెబ్ సైట్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

రోడ్లు, కాలువలు నిర్మించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లిలో రోడ్లు, కాలువలు నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రామలక్ష్మిని స్థానికులు కోరారు. గొల్లపల్లిలో గురువారం వార్డు సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా దాడితల్లి కాలనీలో పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెప్పారు. రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరారు. అర్బన్ హెల్త్ సెంటర్, వీణల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇలు రవికుమార్, సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, కౌన్సిలర్ కె.గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : కొండగంగుపూడిలో గ్రామ సందర్శన జరిగింది. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం పంచాయతీలోని పాఠశాలలు, వసతిగృహం, అంగన్వాడీ కేంద్రాలు, ఆర్‌బికె, చౌకధరల దుకాణాన్ని అధికారులు పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనరసింహం, తహశీల్దార్ సత్యం, ఎంపిడిఒ నిశ్చల, ఇఒపిఆర్‌డి ఉమ, ఎంపిటిసి ముత్యాలమ్మ, సర్పంచ్ బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో మొయిద జంక్షన్-1, ఇందిరా కాలనీ సచివాలయాలను నగర పంచాయతీ కమీషనర్ పి.బాలాజీ ప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ నెల 23 నుండి 27 వరకు ఆధార్ క్యాంపులో భాగంగా సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు. సెగిడి వీధి ఏరియాలో కాలువలపై పలకలను తీసివేయాలని షాపు యజమానులకు చెప్పి, చెత్తను రోడ్లపై పారవేయకుండా పారిశుధ్య వాహనాలకు అందజేయాలన్నారు. మెయిద జంక్షన్ మెయిన్ రోడ్డు ఏరియాలో మేజర్ కాలువలలో పూడికలను జెసిబి ద్వారా తీసివేయిస్తున్న పనులను పరిశీలించారు. కాలువలలో పూడికలు తీసి వేసేటప్పుడు వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, శానిటరీ, ఏమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కొత్తవలస

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం వియ్యంపేట వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకులాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరాతీశారు. ఈ సీజన్లో జ్వరాలు, డయేరియా రాకుండా స్కూల్, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, కాచిచల్లార్చిన నీటినే తాగాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి, మార్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస దేవి, పిహెచ్‌సి ఇఒ నరసింహారావు, హెచ్‌వి పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్ఎం దీప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోతులు పూడ్చుతున్న సిబ్బంది

స్పందించారు.. గుంతలు కప్పారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో అధ్వాన రహదారులపై 'ప్రజాశక్తి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపిడిఒ నిశ్చల ఆదేశాల మేరకు బొద్దాం కూడలి నుంచి ముకుందపురం వెళ్లే రహదారిపై వర్షాలతో ఏర్పడిన పడిన గోతులను పూడ్చారు. ఈ పనులను ఇఒపిఆర్‌డి ఉమ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పద్మ, సంధ్య, ముకుందపురం, బొద్దాం సర్పంచులు కనకరాజు, ఎర్రా రామలక్ష్మి, నాయకులు ఎర్రా సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆకస్మికంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం కూడలిలో గురువారం ఎస్ఐ కె.రాజేష్ ఆధ్వర్యాన వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి రవాణాను అరికట్టడంలో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో వల్లంపూడి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బొండపల్లి : చందకపేట కూడలిలో ఎస్ఐ కె.లక్ష్మణరావు గురువారం ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన పత్రాలు సక్రమంగా లేని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు.

వార్డెన్లపై అధికారుల ఆగ్రహం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పరిశుభ్రత పాటించడం లేదంటూ పూసపాటిరేగ బిసి బాలుర వసతి గృహం, కళాశాల వసతి గృహం వార్డెన్లపై మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి, తహశీల్దార్ ప్రవల్లిక, ఎంపిడిఒ రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పూసపాటిరేగలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సచివాలయంలో అధికారులతో గ్రామంలో మౌలిక సదుపాయాలపై రివ్యూ చేశారు. అనంతరం వసతి గృహాలను సందర్శించారు. అధికారులు వెళ్లేసరికి వసతి గృహంలో దుర్వాసన రావడం, రక్షిత మంచినీరు లేకపోవడంతో తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. మీ ఇల్లు అయితే ఇలాగనే ఉంచుకుంటారా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, అంగన్వాడి ఆసుపత్రులు తనిఖీ చేశారు. పూసపాటిరేగ హైవే నిర్మాణంలో కాలువలు ధ్వంసమయ్యాయని, పునర్నిర్మాణం జరగకపోవడంతో గ్రామం వర్షాకాలంలో ముంపునకు గురవుతుందని మాజీ ఎంపిపి మహంతి చిన్నం నాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు అధికారులకు తెలిపారు. మహంతి వీధిలో తాగునీరు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి లక్ష్మణరావు, మహంతి జనార్దన్‌రావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించిన అధికారులు గ్రంథాలయానికి కుర్చీలు వితరణగా ఇచ్చిన ఎంపిటిసి లక్ష్మినాయుడును అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, మాజీ ఎంపిటిసి మురపాల బొగేస్, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, జనసైనికులు కిలారి రమేష్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెంకాడ: గ్రామ సందర్శనలో భాగంగా మండలంలోని చోళ్లంగిపేటలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు అంగన్వాడీ కేంద్రాలను, పాఠశాలను పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జమదగ్ని, స్థానిక సర్పంచ్ కనకరాజు, ఎంపిటిసి కిరణ్, టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనారాయణ, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ రామారావు, నాయకులు పాణి రాజు, రామరాజు, లక్ష్మణరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంగర: గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఓని అగ్రహారం గ్రామంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ గురువారం పర్యటించారు ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులచే ఇంగ్లీష్ పుస్తకాన్ని చదివించారు. అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మజ్జి శ్రీనివాసరావు, ఆవు సూర్యనారాయణ మాట్లాడుతూ నాగావళి నదికి వెళ్లే తంపరగెడ్డ చెత్తాచెదారాలతో నిండి అధ్వానంగా ఉండడంతో పంటలకు నీరందక నష్టం జరుగుతోందన్నారు. పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి కె.సందీప్ అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చిరంజీవి, ఎంపిడిఒ సల్మాన్ రాజు, ఎంఇఒ ప్రవీణ్, నాయకులు వేగిరెడ్డి కృష్ణ, మజ్జి గణపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని పారసాంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉన్నత పాఠశాల, అంగన్వాడీ సెంటర్, రేషన్ డిపో, ప్రైమరీ స్కూల్‌ను అధికారులు సందర్శించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి. రామారావు, తహశీల్దార్ డి ధర్మరాజు, విస్తరణ అధికారి కె. సింహాద్రి, సచివాలయ సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్ జి.నారాయణ రావు, ఎంపిటిసి ఎస్. జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: గ్రామంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని నోడల్ అధికారి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కౌలువాడ పంచాయతీలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రెవెన్యూ సమస్యలను ఎంపిటిసి కోరాడ పద్మ, నాయకులు కొండపు రమణ, కోరాడ తాతరావు, కొండపు కొత్తయ్యరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జమ్మయ్యపేట కాలిపోయిన సమయంలో రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన పట్టాలు ఒకే వ్యక్తి దగ్గర ఉన్నాయని, లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సురేష్, వైద్యాధికారి తిరుపతి స్వామి, ఎపిఎం ఆదిబాబు, ఎంఇఒ రమణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెసి కార్తీక్

రహదారికి మరమ్మతులు చేపట్టాలని నిరసన

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం నుంచి మెంటాడ వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన గురువారం నిరసన తెలిపారు. ఆ రహదారిలో ఏర్పడిన గుంతల్లోని చేరిన వరదనీటిలో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో మెంటాడ రహదారి ఛిద్రమైందన్నారు. ఎక్కడికక్కడ గుంతల మయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. ఎవరైనా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతే కాంట్రాక్టర్, ఆర్అండ్‌బి అధికారులు బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు. ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు నియోజకవర్గాల మధ్య రహదారి ఇంత దారుణంగా ఉండటం చాలా హేయమని దుయ్యబట్టారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే రోడ్డుకు మరమ్మతులు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఆటో కార్మిక నాయకులు బాలి రాము, పూర్ణ, అప్పారావు, బూడి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి

ప్రజాశక్తి- డెంకాడ

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కె. విజయకళ్యాణి తెలిపారు. మండలంలోని అమకాం గ్రామంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయం సంయుక్తంగా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, స్త్రీల హక్కులు, మధ్యవర్తిత్వం, హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయకళ్యాణి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్య మాట్లాడుతూ ఆడపిల్లలకు పుట్టుకతోనే ఆస్తిహక్కు సంక్రమిస్తుందన్నారు. పిత్రార్జితమైన ఆస్తి అయినా వారసత్వపు ఆస్తి అయినా అన్నింట పురుషులతో సమానంగా సమాన హక్కు ఉంటుందని తెలిపారు. సంవత్సరాల తరబడి కోర్టులలో సాంప్రదాయ పద్ధతిలో కేసులు జరిపించుకునే కంటే సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే అపీల్ చేసుకునే అవకాశం లేనందున సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయకల్యాణి

అంతర పంటలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

అంతర పంటలపై ప్రతి రైతూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి రామారావు కోరారు. గురువారం మండలం లోని మెట్టవలస గ్రామంలో క్షేత్ర సందర్శనలో భాగంగా పత్తి పంట పొలాలను ఆయన పరిశీలించారు. పత్తిలో అంతర పంటగా కందులు, పొద్దు తిరుగుడు పువ్వుల విత్తనాలను వేయించిన పొలాన్ని పరిశీలించారు. పత్తి పంటను ఆశించే రసం పీల్చే, వంగలి పురుగులు ముందుగా ఈ అంతర పంటపై ఆశిస్తే, వాటి ఉధృతి ఆధారంగా ప్రధాన పంటకు పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉందా? లేదా? అనేది తెలుసుకోవచ్చని తెలిపారు. అ వరి నారుమళ్లను పరిశీలించి వేస్ట్ డీకంపోజర్ సేంద్రియ ఎరువును రైతులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి ఎం.శ్యామ్‌సుందర్ , వ్యవసాయ శాఖ సహాయకులు బి.రాజశేఖర్ పాల్గొన్నారు.



పత్తిపొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు

డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన

నెల్లిమర్ల : మండలంలోని పారసాం గ్రామంలో డ్రమ్ సీడర్‌పై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం అధికారి టి.సంగీత రైతులకు అవగహన కల్పించి వరి నారుమడులు, డ్రమ్ సీడర్‌తో వరి వేసిన విధానాన్ని వివరించారు. అనంతరం ఆమె రైతులకు సూడోమోనస్‌తో విత్తనశుద్ధి, కలుపు యాజమాన్యం, నారు మడి లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు గురుంచి వివరించారు. కార్యక్రమంలో ఎఒ ఎం పూర్ణిమ, ఎఇఒ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పాలకులకు తెలియకుండా పంచాయతీ పాలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పంచాయతీ పాలకులకు తెలియకుండా పరిపాలన సాగుతోందని శృంగవరపుకోట మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ మోపాడ కుమార్ ఆరోపించారు. గత వారం నిర్వహించిన పంచాయతీ వేలం పాటలను ఆమోదించేందుకు గురువారం పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇఒ అనురాధ, సర్పంచ్ సంతోష్ కుమారి, ఉపసర్పంచ్ మోపాడ కుమార్ హాజరయ్యారు. ఉపసర్పంచ్ కుమార్ మాట్లాడుతూ. పట్టణంలో అనుమతి లేని లేఅవుట్లలో నిర్మించే నిర్మాణాలకు, పోరంబోకు స్థలాలు, చెరువుల్లో చేపట్టే నిర్మాణాలకు, ప్లాన్లకు పంచాయతీ ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీకి వచ్చే ఆదాయాన్ని సక్రమంగా వసూలు చేయకపోవడంతో పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి తలెత్తిందని తెలిపారు. అధికారులు తీరు మార్చుకొని పంచాయతీ వచ్చే ఆదాయాన్ని సక్రమంగా వసూలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వేలం పాటలను సభ్యులు ఆమోదించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి డ్రాపౌట్స్‌ను నివారించడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'తల్లికి వందనం' పథకం కేవలం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాస, వర్కింగ్ ప్రెసిడెంట్ రావడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బంకపల్లి శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని అంశాలలోనూ ముందుంటారని, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే వారు ఆర్థికంగా వెనుకబడిన వారు కాబట్టి వారికే తల్లికి వందనం పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 33/11 కెవి ఒంటితడి సబ్ స్టేషన్ లో గల 11 కెవి ఉడా ఫీడర్, 33/11 కెవి తోటపాలెం సబ్ స్టేషన్‌లో గల 11 కెవి బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలను తొలగించే క్రమములో పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఇఇ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదీప్ నగర్, సిబి కాలనీ, అలకానంద కాలనీ, బొగ్గులదిబ్బ, ఎల్‌బి కాలనీ, షాలిమార్ హోటల్ , వివేకానంద కాలనీ, బ్యాంకు కాలనీ, ఇందిరా నగర్, శ్రీరామ్ కాలనీ, మయూరి జంక్షన్, రైల్వే స్టేషన్ రోడ్, ఆర్టీసి కాంప్లెక్స్ ఏరియా తదితర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

చెరువులను పరిరక్షించండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కృష్ణాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులు తీసుకోవాలని సర్పంచ్ యామిని దేవి కోరారు. గురువారం మండలంలోని కృష్ణాపురంలో నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ సాంబమూర్తితోపాటు సర్పంచ్ యామిని దేవి పాల్గొన్నారు. అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల, పౌరసరఫరాల దుకాణాన్ని అధికారులు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.శ్రావణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

శృంగవరపుకోట : పట్టణంలోనిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు ఈయ నెల 28వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్, కామర్స్, ఫిజిక్స్, ఫిజికల్ డైరెక్టర్ సబ్జెక్టులకు అధ్యాపకులను నియమిస్తున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

కొనసాగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు

శృంగవరపుకోట : పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను గురువారం ఏర్పాటుచేశారు. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు, సందేశాత్మక సాంఘిక నాటికలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద మహా ధర్నా

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాని వెంటనే తొలగించాలని కోరుతూ ఈ నెల 30న ఉదయం 10 నుంచి 12 వరకూ జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో మహా ధర్నా చేస్తామని జిల్లా పౌరవేదిక అధ్యక్షులు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మహా ధర్నాని ప్రజలు, ప్రజా సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నాయకులు విజయవంతం చెయ్యాలని కోరారు. కట్టకూడని చోట టోల్ ప్లాజాని కట్టి ప్రజల నుంచి ముక్కుపిండి టోల్ వసూలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, అంబెద్కర్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రమణ, చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి జాగరపు ఈశ్వరప్రసాద్, మాతృభూమి సేవా సంఘం అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు, అమ్మా సేవాసంఘం అధ్యక్షుడు దుక్క శేఖర్, తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్, తాత్రాజు రాజారావు, గంటా వీర్రాజు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ


మండలంలోని నల్లబెల్లిలో ప్రభుత్వ పాఠశాలను ఎంఇఒ జగదీశ్వరరావు గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, విద్యార్థుల నోట్ పుస్తకాలు, తదితర వాటిని పరిశీలించి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన.. వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి సునంద, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురిటిపెంటలో వరుస చోరీలు

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పురిటిపెంట న్యూ కాలనీలో బుధవారం రాత్రి రెండు వరుస దొంగతనాలు జరిగాయి. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో గల పాత ఎంపిడిఒ ఆఫీస్ రోడ్‌లో నివాసముంటున్న గజపతినగరం గ్రంథాలయాధికారి పొందూరు స్వప్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని పొందూరు రాము స్వప్న దంపతులు తాము కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో బుధవారం రాత్రి నిద్రించి తెల్లవారుజామున ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.బీరువాలో దాచిన 8 తులాల బంగారం, ఐదు తులాల వెండి, రూ.20వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూ కాలనీలో డాక్టర్ కష్ణారావు హాస్పిటల్ కి సమీపంలో గల ముద్రగడ గౌరి ఇంట్లో కూడా చోరీ జరిగింది. కింద ఇంట్లో రేడియో మెకానిక్ షాపు నడుపుకుంటూ పై ఇంట్లో నివాసం ఉంటున్న ముద్రగడ గౌరి బుధవారం రాత్రి వర్షంలో తడిసి వచ్చి తన చేతికి ఉన్న రెండు ఉంగరాలు, రూ.15వేలు నగదు షాప్‌లో గల నగదు కౌంటర్లో దాచాడు. తెల్లవారుజామున కిందకు వచ్చి షాపు తెరిచేందుకు రాగా తలుపులు తెరిచి ఉండడంతో లబోదిబో మన్నాడు. కౌంటర్లో దాచిన తులం పావు బంగారు ఉంగరాలు, నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిఐ ప్రభాకర్ రావు, ఎస్ఐ యు.మహేష్ విజయనగరం నుంచి క్లూస్ టీమ్లను రప్పించారు. చోరీ జరిగిన సంఘటన స్థలాలు వద్దకు వెళ్లి ఫింగర్ ప్రింట్లను ను సేకరించారు. కేసుల దర్యాప్తును ముమ్మరం చేశారు.



పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం గ్రామంలోని జాతీయ రహదారిపై పిచ్చికుక్క ఆరుగురు వ్యక్తులపై దాడి చేసింది. మరో వ్యక్తిపై దాడి చేస్తున్న సమయంలో ఆ వ్యక్తి తిరిగి దాడి చేసి కుక్కను అక్కడికక్కడే చంపేశాడు. ఇందులో ఒక వ్యక్తికి కంటి వద్ద కరవడంతో ఆయనను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. హైవేపై కోత మిషన్ సమీపంలో పిచ్చికుక్క గురువారం ఒక్కసారిగా దాడికి పాల్పడింది. నడుచుకుని వెళ్తున్న భోగాపురం గ్రామానికి చెందిన సవరం రమేష్, సూరిబాబు, రామేశ్వరపు రమణమ్మ తో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై దాడి చేసింది. ఇందులో వ్యక్తికి కంటి సమీపంలో గాయపరచడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వీరందరిని సుందర పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంటి పై గాయపడిన వ్యక్తి పరిస్థితి లక్ష్మంగా ఉండడంతో విజయనగరం కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే మరో వ్యక్తిని కరవడానికి ప్రయత్నించడంతో ఆ వ్యక్తి కుక్కపై దాడి చేసి ఆ కుక్కని అక్కడే చంపేశాడు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

భోగాపురం : బాలికను అపహరించి రెండు నెలలపాటు దాయడంతో యువకుడిపై కిడ్నాప్ తో పాటు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. ముంజేరు గ్రామానికి చెందిన రాయపు రెడ్డి సురేష్ అదే గ్రామానికి చెందిన ఒక బాలికను మే 21వ తేదిన కిడ్నాప్ చేసినట్లు బాలిక తల్లిదండ్రులు అప్పట్లో ఫిర్యాదు చేశారు. గత రెండు నెలల నుంచి వీరిని పట్టుకునేందుకు చాలా ప్రయత్నాలు చేశారు కానీ చిక్కలేదు. చివరికి హైదరాబాదులో ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ సూర్యకుమారి సిబ్బందితో వెళ్లి బుధవారం పట్టుకున్నారు. గురువారం వీరిద్దరిని స్టేషన్ తీసుకువచ్చి యువకుడిపై కేసు నమోదు చేశారు. డిఎస్‌పి గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామభద్రపురం: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో ఈనెల 16న అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించగా, గురువారం మృతి చెందాడని ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఇతని ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.